# హృదయ సంబంధమైన స్వాతంత్ర్యాన్ని సంపాదించండి!

*(2007 ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని సాయికుల్వంత్ సభామండపంలో జరిగిన కార్యక్రమంలో మకుటాయ మానమైనది భగవాన్ చేసిన ఉత్తేజకరమైన ఉపన్యాసం. దేశ స్వాతంత్ర్యం కోసం మహామహులు చేసిన త్యాగాలనుగురించి ముగ్గురు పెద్దలు ప్రసంగించిన తరువాత భగవాన్ తమ మహోపన్యాసంతో అందరిపైనా అనుగ్రహ వృష్టి కురిపించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడైన శ్రీ సుభాష్ చంద్రబోస్ దేశానికి చేసిన సేవలను గురించి ప్రస్తావిస్తూ, భారతీయులలో ఐకమత్యం లోపించడంచేతనే అతను దేశాన్ని వదలిపెట్టి వెళ్ళవలసివచ్చిందని అన్నారు. భగవాన్ దివ్య ప్రసంగంయొక్క పూర్తి పాఠం ఈ క్రింద ఇవ్వబడినది)*

ఇక్కడ ఇంతమంది మాట్లాడారుకాని, సుభాష్ చంద్రబోస్ సంగతి ఎవరూ చెప్పలేదు. అతను గొప్ప గుణవంతుడు, శక్తిమంతుడు. ఐసిఎస్ పాసైన తరువాత అతను ఇండియాకు వచ్చి రాజకీయములో చేరి దేశంకోసం అనేకవిధములుగా పాటుపడ్డాడు. కాని, దురదృష్టవశాత్తు భారతీయులలో ఐకమత్యము లేకపోవడంచేత అతను బయటకు వెళ్లవలసివచ్చింది. అయితే, తాను పర దేశములో ఉండినప్పటికీ భారత దేశముపై అభిమానము పోగొట్టుకోలేదు; దిన దినమునకూ పెంచుకుంటూ వచ్చాడు. అతనిలో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తులు నిండుగా ఉండేటటువంటివి. ఆధ్యాత్మికములోకూడను అతను చాలా గొప్పవాడు. అయితే, ఎవరికీ చెప్పుకునేవాడు కాదు. "భారతదేశము బాగుపడాలి. ఇది ఉత్తమ దేశం కావాలి, పవిత్ర దేశం కావాలి" అని ఎంతో

sri sathyasai vachanamrutam

ఆశించేవాడు, పాపం! మన భారతదేశములో ఎందరో నాయకులున్నారు. కాని, ఉండి ప్రయోజనమేమిటి?! అందరూ చెపుతున్నారేగాని చేయడం లేదు. చెప్పవచ్చు కోటి, చెయ్యరు ఒక్కటీ! కాని, సుభాష్ చంద్రబోస్ అటువంటి నాయకుడు కాదు. అతను దేశానికి పూర్తిగా అర్పితమైన వ్యక్తి. అటువంటి వ్యక్తిని ఈనాడు ఎవ్వరూ తలుచుకోవడం లేదు. అదే నా బాధ.

సుభాష్ చంద్రబోస్ అన్న పేరు శరత్ చంద్రబోస్. అతని బిడ్డ లలితాబోస్ ప్రశాంతి నిలయానికి వచ్చి ఎంతో ఆనందంగా ఒక నెలరోజులు ఉన్నది. వైట్‌ఫీల్డుకు కూడా వచ్చి కొద్ది రోజులున్నది. తరువాత నావెంట కొడైకెనాల్ వచ్చింది; ఊటీ వచ్చింది; మూడు నెలలు నావెంటనే తిరిగింది. ఆమె భజనలో హార్మోనియం వాయించేది. ఇక్కడ ఉన్నంతకాలము ఆమెకు నిరంతరం సాయినామ స్మరణ తప్ప మరొక ధ్యాస లేదు. "నా పినతండ్రి ఈ పవిత్రమైన భారత దేశమునందు జన్మించాడు కాని, ఇక్కడ ఉండలేక పోయాడు" అని చెప్పి చాలా బాధపడింది. ఈ దేశంలో జన్మించినందుకు కనీసం తానైనా స్వామిని దర్శించుకో గల్గినందుకు ఎంతో ఆనందించింది.

**స్వరాజ్యం కాదు ముఖ్యం, స్వారాజ్యం కావాలి**

సుభాష్ చంద్రబోస్ దేశంకోసం ఎంతగానో పాటుపడ్డాడు; ప్రేమను చూపించాడు; సహనాన్ని చూపించాడు; మార్గదర్శకుడయ్యాడు.

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నా మత మం**
**చెదగొట్టి నుడువనేరని**
**బదికిన పీనుగొకండీ వసుధను గలడా!**

దేశాభిమానము లేనివాడు చచ్చినవానితో సమానం. దేశముయొక్క పేరును నిలబెట్టినవాడే నిజంగా బ్రతికి ఉన్నట్లు లెక్క. ఈనాడు భారతీయులు స్వతంత్ర్యమును సంపాదించారు. అయితే, ఇది స్వతంత్ర్యమేకాని, స్వాతంత్ర్యము కాదు. దేహానికి, మనస్సుకు, బుద్ధికి మాత్రమే సంబంధించినది – స్వతంత్ర్యము; ఆత్మకు సంబంధించినది – స్వాతంత్ర్యము.

sri sathyasai vahamrutam

ఇది స్వరాజ్యము, అది స్వారాజ్యము. మనం సంపాదించినది స్వరాజ్యమే గాని స్వారాజ్యము కాదు. స్వారాజ్యము అంటే ఆత్మకు సంబంధించినటువంటిది. ఆత్మను మనము ఎప్పుడు అనుసరిస్తామో అప్పుడంతా క్షేమమే కలుగుతుంది; ప్రపంచమంతా క్షేమంగానే ఉంటుంది; ఉన్నత స్థితికి వస్తుంది. కనుక, మనము స్వతంత్ర్యం వచ్చిందని ఆనందిస్తే సరిపోదు; స్వాతంత్ర్యం సంపాదించాలి. ఈ స్వాతంత్ర్యమును సంపాదించాలని సుభాష్ చంద్రబోస్ ఎంతగానో ప్రయత్నం చేశాడు. కట్టకడపటికి తాను సాధించాడుకాని ఇతరులకు అందించలేకపోయాడు. ఇటువంటి మహనీయులయొక్క తత్త్వమును అందరూ తెలుసుకోవాలి. భారతీయులలో స్వాతంత్ర్యమును సంపాదించిన కొద్దిమందిలో సుభాష్ చంద్రబోస్ ఒకడు. అతను దేశమంతా ఒక్కటే అని విశ్వసించాడు.

**దానగుణం లేని శ్రీమంతులే అందరికంటే బీదవారు**

ఆత్మ అందరికీ ఒక్కటే. నీకూ, నాకూ, సర్వులకూ ఆత్మశక్తి ఉంటున్నది. కనుకనే, కృష్ణుడుకూడా చెప్పాడు, “మీరందరూ నా అంశములే! నేను సర్వులను ఎట్లు చూస్తున్నానో మీరుకూడా ఆవిధంగా చూడాలి.” కాబట్టి, love all, serve all. అందరినీ ప్రేమించాలి. అందరికీ సేవ చేయాలి. ‘వీడు బీదవాడు, వాడు కోటీశ్వరుడు’ అన్న తారతమ్యం చూపకూడదు. భారతదేశంలో అనేకమంది కోటీశ్వరులు ఉన్నారు; తమకు కావలసినంత తిండి తాము తింటున్నారు. కాని, ఎవరైనా వాళ్ళ వాకిలిముందుకు వచ్చి ‘భవతీ భిక్షాం దేహి’ అని అడిగితే ఒక పిడికెడు అన్నం పెట్టేవాడు లేడు. ఇలాంటి శ్రీమంతులు దేశంలో ఉండి ప్రయోజనమేమిటి! పేరుకు మాత్రమే వాళ్ళు శ్రీమంతులు. నిజంగా వాళ్ళకన్న బీదవారు మరొకరు లేరు. ఎంతోమంది సంపన్నులు ఉండికూడను ఈనాడు దేశంలో దానధర్మాలు పూర్తిగా శూన్యమై పోయాయి. మనము దానధర్మాలు చేయాలి. సాటి వ్యక్తులను మనవలె చూడాలి; మనవారివలె, మన సోదరీ సోదరులవలె చూడాలి. అందరూ వేదికమీద నిలబడి ‘బ్రదర్స్ అండ్ సిస్టర్స్’ అంటారు. కాని, ఎవరు పాటిస్తున్నారు? నిజంగా తోటివారిని ‘బ్రదర్స్ అండ్ సిస్టర్స్’గా ప్రేమించేవారు కనిపించడం లేదు.



srisathyasaivachanamrutam

**పరమ పావనమైన భారతావనియందు**
**సహనమన్నదె మనకు చక్కదనము**
**వ్రతములన్నిటియందు వన్నె గాంచినయట్టి**
**ఘన సత్యశీలమే కఠిన తపము**
**మధుర భావంబేది మన దేశమందన్న**
**మాతృభావముకన్న మాన్యమెద్ది?**
**ప్రాణంబుకంటెను మానంబె ఘనమను**
**మన దేశ నీతిని మంటగలిపి**
**నేటికిచ్చిరి పరదేశ నీతులరసి**
**వెస విచిత్ర స్వేచ్ఛయను విచ్చుకత్తి**
**ఔరా! ఏమందు భారత పాలనంబు**
**ఏనుగెట్టుల తన బలమెఱుగలేదొ**
**అట్టులైనారు మన భారతీయులు నేడు**

ఈనాడు ఎక్కడకు పోయినా ధనము, ధనము, ధనము! అందరూ ధనమును సంపాదించడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నారుగాని, ప్రేమను సంపాదించడానికి, ధర్మమును సంపాదించడానికి ఎవరూ ప్రయత్నించడం లేదు. ఆత్మతత్త్వమనేది అందరియందు ఉంటున్నది. "దైవం మానుష రూపేణ." దైవస్వరూపుడైన మనిషిని తిరస్కరించడం మంచిది కాదు. అందరూ మన సోదరీ సోదరులే అన్న భావము మీలో ఎప్పుడు కలుగుతుందో అప్పుడే మీరు స్వారాజ్యమును సాధించినవారవుతారు. అంతవరకు ఇది స్వరాజ్యమే, స్వరాజ్యమే, స్వరాజ్యమే! ఇక్కడ 'స్వ' అంటే స్వార్థము. మనం సంపాదించ వలసింది 'స్వారాజ్యము'. అనగా, హృదయ సంబంధమైన స్వాతంత్ర్యాన్ని సంపాదించాలి.

విద్యార్థులారా! మీరు గ్రామసేవ చేస్తున్నారు; బీదవారికి సేవ చేస్తున్నారు. మొట్టమొదట మీరు నిజమైన స్వాతంత్ర్యాన్ని సంపాదించండి. ప్రతి ఒక్కరినీ ప్రేమించండి, ఆదరించండి. ప్రతి ఒక్కరికీ సహాయం చేయండి. అప్పుడే మీరు సత్యసాయి కాలేజీలో చదివిన విద్యార్థులని సార్థక నామాన్ని పొందుతారు. స్వరాజ్యము కాదు మనకు ముఖ్యం;

srisathyasaivachanamrutam

స్వారాజ్యముకోసం పాటుపడండి. 'స్వా' అంటే ఆత్మ. అదే మన స్వంతరాజ్యము. అన్నింటినీ మార్చవచ్చునుకాని, ఆత్మను ఎవ్వరూ మార్చలేరు. ఎలాంటి దుర్మార్గులు, రాక్షసులుకూడను ఆత్మను మార్చలేరు. అటువంటి మార్పులేని ఆత్మసామ్రాజ్యాన్ని మీరు సంపాదించండి. ఆత్మవిశ్వాసాన్ని పెట్టుకోండి. ప్రతి మానవునికి ఆత్మవిశ్వాసమే ప్రధానము. అదే నిత్యము, సత్యము అయినటువంటి స్థానము. అటువంటి స్వారాజ్యమును మీరు సంపాదించి గొప్ప కీర్తిని గడించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తున్నాను.

సుభాష్ చంద్రబోస్ చాలా గొప్పవాడు. మొదటి నుండి అతనంటే నాకు చాలా అభిమానం. ఇప్పుడు నన్ను మాట్లాడమని ఎవ్వరూ కోరలేదు. అతనిపైనున్న ప్రేమవల్ల నా అంతట నేను నిల్చుని మాట్లాడుతున్నాను. అతనిపై నాకున్న ప్రేమ, వాత్సల్యములు అలాంటివి. అటువంటి వ్యక్తి మన భారతదేశములో తప్పక మళ్ళీ పుట్టాలి. అతనే గనుక ఇప్పుడు భారతదేశములో ఉండి ఉంటే ఎంతో గొప్ప కీర్తిని సంపాదించేవాడు; అసలీ దేశంలో భిక్షకులే ఉండేవారు కాదు. కాని, దురదృష్ట వశాత్తు భారతీయులే అతనిని దేశమునుండి బయటికి పంపి, దుఃఖమును అనుభవిస్తున్నారు. అట్టివారిని మనము ఎప్పుడూ ప్రేమించాలి, విశ్వసించాలి. విశ్వాసము, ప్రేమ – ఈ రెండే మనకు బలమును, ధైర్యమును కలిగిస్తాయి. సుభాష్ చంద్రబోస్‌ను ఎన్నడూ మరువకూడదు. కాని, ఇలాంటి మంచివారిని మరచిపోతున్నాం, చెడ్డవారిని నిరంతరం స్మరిస్తున్నాము. అది చాలా తప్పు. మంచివారిని మరువకూడదు. మంచివారే మనకు మాణిక్యమువంటివారు. అలాంటివారిని మీరు మరచిపోకుండా నిరంతరము స్మరిస్తూ వారి ఆదర్శాలను అనుసరించాలి.

**( స్వాతంత్ర్య దినోత్సవ సందేశం, తేదీ 15.8.2007, సాయికుల్వంత్ సభామండపం)**

sri sathyasai vachanamrutam